

సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌కు స్వాగతం



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి భూషణ్ రామకృష్ణ గవాయ్‌కు బొకే అందజేసి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ బాలాజీ

గన్నవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్‌కు గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. గుంటూరు జిల్లా మంగళగిరి పర్యటన నిమిత్తం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో ఆయన శనివారం విమానాశ్రయానికి విచ్చేశారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ రమేశ్, ఏపీ అడ్వకేట్ జనరల్ డి.శ్రీనివాస్, కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ వి.విద్యాసాగర్, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.చిదంబరం తదితరులు పూలబొకేలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం రోడ్డుమార్గాన ఆయన విజయవాడ వెళ్లారు.



మూలపాడు నగరవనం మెయిన్ గేటు వద్ద పర్యాటకుల సెల్ఫీలు



ఫస్ట్ వ్యూ పాయింట్ వద్ద ఏర్పాటుచేసిన జిప్‌లైన్

నగరవనం

మూలపాడు నగరవనంలో జిప్‌లైన్ అడ్వెంచర్

ట్రయల్ రన్ సక్సెస్.. డిసెంబరుకు అందుబాటులోకి.. • దొంగమర్ల బావి వద్దకు వెళ్లేందుకు రెండు సఫారీలు

(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం) : మూలపాడు నగరవనంతో పాటు కొండపల్లి రిజర్వు ఫారెస్టు అందాలను వీక్షించేందుకు జిప్‌లైన్ అడ్వెంచర్ రెడీ అవుతోంది. గండికోట అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీ సౌజన్యంతో పర్యాటక, అటవీశాఖ అధికారులు దీనిని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. నగరవనంలోని రెండో గేటుకు 50 మీటర్ల ముందు ఉన్న మొదటి వ్యూ పాయింట్ కుడి, ఎడమ కొండల మధ్య ఈ జిప్‌లైన్ ఏర్పాటు చేశారు. ఎడమ నుంచి కుడివైపు వరకు ఉన్న ఎత్తయిన కొండ మీదకు 170 మీటర్లు, కుడి నుంచి ఎడమ వరకు ఉన్న మరో ఎత్తయిన కొండ మీదకు 180 మీటర్లు జిప్‌లైన్ ఏర్పాటు చేశారు. మొత్తం కలిపి 350 మీటర్ల మేర ప్రయాణం చేయవచ్చు. నగరవనంలోని అందమైన ప్రదేశాలతో పాటు దట్టమైన, సుందరమైన కొండపల్లి రిజర్వు ఫారెస్టు అందాలను వీక్షించేందుకు దీనిని ఏర్పాటు చేశారు. డిసెంబరు నాటికి అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

సఫారీ వాహనాలు సిద్ధం

నగరవనం నుంచి కొండపల్లి రిజర్వు ఫారెస్టులోని దొంగమర్ల బావితో పాటు అక్కడ ఉన్న ఆంజనేయస్వామి ఆలయం, పలు జలపాతాలను పర్యాటకులు కుటుంబ సమేతంగా, స్నేహితులతో కలిసి వీక్షించేందుకు మొదటి గేటు వద్ద రెండు సఫారీ వాహనాలను అధికారులు సిద్ధం చేశారు. అక్కడి నుంచి దొంగమర్ల బావి ప్రాంతం సుమారు 8 కిలోమీటర్ల దూరంలో ఉంది. అధిక వర్షాల వల్ల జలపాతాలు రహదారిపై పారడంతో ఘాట్‌రోడ్డు బురదమయంగా మారింది. పర్యాటకులు సొంత వాహనాల్లో వీల్లేని పరిస్థితి. పర్యాటకుల సౌలభ్యం కోసం రెండు సఫారీ వాహనాలను అధికారులు సిద్ధంగా ఉంచారు. ఒక్కోదానిలో సుమారు 15 మంది వరకు ప్రయాణం చేయవచ్చు. ఇప్పటికే నేరేడు వనంలో సైకిల్ ట్రాక్స్ ఏర్పాటుచేసి పర్యాటకులకు ఆరు సైకిళ్లను సిద్ధంగా ఉంచారు.

భవనాల్లో భయంగా..

జిల్లాలోని రెవెన్యూ కార్యాలయాలు శిథిలావస్థకు చేరాయి. తుఫాన్ల సమయంలో బలమైన గాలుల ప్రభావానికి ఎక్కడ పడిపోతాయోనని భయపడాల్సిన పరిస్థితికి చేరాయి. జిల్లాల విభజన జరిగి నాలుగేళ్లయినా, రెవెన్యూ కార్యాలయాలు శిథిలావస్థకు చేరినా కొత్త భవనాల నిర్మాణం ఆలోచనకు ఇంతవరకు శ్రీకారం చుట్టలేదు. - ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం

ఇప్పటికైనా కొత్త భవనాలు నిర్మించాలంటున్న సిబ్బంది

శిథిలావస్థకు చేరిన జిల్లాలోని రెవెన్యూ కార్యాలయాలు

భారీ వర్షాలు, తుఫాన్లు సంభవించినప్పుడు భయంకరమే..

- కార్యాలయాల్లోకి వర్షపు నీరు చేరి అవస్థలు
- రికార్డు రూముల్లోకీ నీరు.. పాడైపోతున్న విలువైన పత్రాలు
- చల్లపల్లి కార్యాలయంలో అధికారి టేబుల్‌పై పడిన శ్లాబ్





శిథిలావస్థకు చేరిన బంటుమిల్లి తహసీల్దార్ కార్యాలయం (ఇన్‌సెట్‌లో) పునాదుల దశకే పరిమితమైన మచిలీపట్నం తహసీల్దార్ కార్యాలయ నిర్మాణం

వర్షం వస్తే అంతే..

గుడివాడ తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలు 1907లో నిర్మించినవి. వీటి పైకప్పులు పూర్తిగా దెబ్బతిన్నాయి. గోడలు బీట్లు ఇచ్చి ఏ క్షణంలో కూలిపోతాయో తెలియని పరిస్థితి. 118 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ భవనాల పైకప్పులు పూర్తిగా దెబ్బతిన్నాయి. కొద్దిపాటి వర్షం కురిసినా వర్షపునీరు కార్యాలయంలోని గదుల్లోకి చేరుతోంది. దీంతో ఈ కార్యాలయాల పైకప్పులపై తారు రేకులు వేశారు. అవికూడా పాడైపోవడంతో ఇటీవల కురిసిన భారీవర్షాలకు వర్షపునీరు కార్యాలయ గదుల్లోకి చేరింది. గదుల్లోని కంప్యూటర్లు ఆన్ చేయాలన్నా భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాతభవనాల స్థానంలో నూతన భవనాల నిర్మాణానికి ఇంత వరకు ఎలాంటి ప్రతిపాదనలు తయారు చేయలేదు.

బందరులో భవనాలు భయంకరం

జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలోని తహసీల్దార్ కార్యాలయం, కలెక్టరేట్ ప్రాంగణంలోని ఆర్డీవో కార్యాలయాలు బ్రిటీష్ కాలంలో నిర్మించారు. శిథిలావస్థకు చేరడంతో 2018-సెప్టెంబరు 28న ఈ రెండు కార్యాలయాల నూతన భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. ఆ తర్వాత వేర్వేరు కారణాలతో ఆ నిర్మాణాలను నిలిపివేశారు. ఈ కార్యాలయాలు పల్లపు ప్రాంతంలో ఉండటంతో వర్షపునీరు ప్రవేశించి పరిపాలనాపరమైన కార్యకలాపాలకు తీవ్ర అడ్డంకులు ఏర్పడుతున్నాయి. రెండేళ్ల కిందట మచిలీపట్నం తహసీల్దార్ కార్యాలయాన్ని నార్త్, సౌత్ మండలాలుగా విభజించారు. నార్త్ మండల కార్యాలయం పాత భవనంలో కొనసాగుతుండగా, సౌత్ మండల కార్యాలయాన్ని పక్కనే ఉన్న జలవనరులశాఖ అతిథి గృహంలో తాత్కాలికంగా మిగతా 6లో..



కనీస వసతులు కరువు

జగనన్న కాలనీల్లో అంతా మొక్కుబడి తంతే!

- కప్తానుపాలెం శివారులో ఇళ్ల స్థలాలకు పంచిన డొంకదారి
- లోతట్టు ప్రాంతంలో కె.కొత్తపాలెం లే అవుట్
- ఇళ్లు నిర్మించుకుందామన్నా అవకాశం లేక లబ్ధిదారుల అవస్థలు
- కాక్శిలిగడ్డలో రహదారి లేక మురుగులోనే రాకపోకలు
- గత వైసీపీ ప్రభుత్వం తీరుపై విమర్శలు.. కూటమి ప్రభుత్వం చొరవ చూపాలని వేడుకోలు

6

చలో సింగపూర్

సింగపూర్‌కు విమాన సర్వీసుల పునరుద్ధరణ



సింగపూర్ విమానాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

- 140 మందితో రాక.. 123 మందితో పోక
- సర్వీసు ప్రారంభించిన ఎమ్మెల్యే యార్లగడ్డ
- చంద్రబాబు, లోకేశ్‌కు ప్రయాణికుల కృతజ్ఞతలు

(ఆంధ్రజ్యోతి, గన్నవరం) : ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న విజయవాడ-సింగపూర్ విమాన సర్వీసు శనివారం ప్రారంభమైంది. కూటమి ప్రభుత్వ చొరవతో అంతర్జాతీయ సర్వీసు మొదలు కావడంపై అన్ని వర్గాల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వారంలో మంగళ, గురు, శనివారాల్లో రాకపోకలు సాగించే ఈ సర్వీసును ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మిగతా 6లో..

సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు



సింగపూర్‌కు విమానం సర్వీసును ఏర్పాటుచేసిన సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుకు ధన్యవాదాలు. తాడేపల్లిగూడెం నుంచి గన్నవరం మాకు దగ్గరగా ఉంటుంది. ఇంతకు ముందు చెన్నై, హైదరాబాద్ వెళ్లి సింగపూర్ వెళ్లాల్సి వచ్చేది. మొదటిసారి నేరుగా వెళ్లడం హ్యాపీగా ఉంది. - ప్రయాణికురాలు

రాజకీయాల్లోకి వంగవీటి ఆశకిరణ్
- నేడు తండ్రి రంగ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు

6



కూలిన వందేళ్ల నాటి వంతెన
- పది గ్రామాల ప్రజల రాకపోకలకు ఆటంకం

పోరాట వీరుడు బిర్సా ముండా



బిర్సా ముండా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గిరిజన హక్కుల కోసం పోరాడిన వీరుడు బిర్సా ముండా అని కలెక్టర్ బాలాజీ అన్నారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని గిరిజనుల సంక్షేమం కోసం కృషి చేయాలని కోరారు. కలెక్టరేట్‌లో శనివారం బిర్సా ముండా జయంతి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బాలాజీ ముఖ్యఅతిథిగా పాల్గొని నివాళులర్పించారు. అడవి, భూమి, నీరు నినాదాలతో ఆదివాసీలను ఐక్యం చేసి హక్కుల కోసం పోరాడారన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో చంద్రశేఖర్, జెడ్పీ సీఈవో కన్నమనాయుడు, గిరిజన సంక్షేమ శాఖాధికారి ఫణిధూర్జటి, బీసీ సంక్షేమాధికారి రమేష్, డీఈవో రామారావు తదితరులు పాల్గొన్నారు.

క్యాపిటల్ ఆస్పత్రిలో అరుదైన గుండె శస్త్ర చికిత్స



శస్త్ర చికిత్స అనంతరం కోలుకున్న రవళి (ఎడమ వైపు)

పెనమలూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ఇప్పటివరకు ఉన్న ఆట్రియల్ సెప్టల్ డిఫెక్టు లేకుండా ఐసోలేటెడ్ కుడివైపు పాక్షిక క్రమరహిత పల్మనరీ వీనస్ కనెక్షన్ సర్జరీ విజయవంతంగా నిర్వహించినట్లు ఆస్పత్రి కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ హేమకృష్ణసాయి కడియాల తెలిపారు. మచిలీపట్టణానికి చెందిన రవళి(29)అనే గృహిణికి ఇద్దరు సంతానం. క్రమంగా ఆమెకు శ్వాస ఆడకపోవడం, అలసటతో బాధపడుతుండడం జరుగుతోంది. గతంలో ఆమెను హైదరాబాద్‌లోని ఒక కార్పొరేట్ ఆసుపత్రిలో చూపించారు. విజయవాడ, చుట్టు పక్కల ఆస్పత్రుల్లో ఆమెకు శస్త్ర చికిత్స నిరాకరించారు. దీంతో ఆమె క్యాపిటల్ ఆసుపత్రికి చెందిన డాక్టర్ హేమకృష్ణసాయిని సంప్రదించారు. ఇది పెద్దవారిలో వచ్చే అత్యంత సవాలుతో కూడిన, పుట్టుకతో వచ్చే అరుదైన వ్యాధి అని గ్రహించిన డాక్టర్ హేమకృష్ణసాయి క్రమరహిత పల్మనరీ సిరలను ఎడమ కర్ణికకు జాగ్రత్తగా మళ్లించి సర్జరీని విజయవంతంగా ముగించారు. 20 రోజుల ఇంటెన్సివ్ చికిత్స తర్వాత రవళి కోలుకొని సురక్షితంగా డిశ్చార్జి అయినట్లు తెలిపారు. ఈ సర్జరీ ఆసుపత్రి యొక్క అధునాతన గుండె సంరక్షణ సామర్థ్యాలను, బహుళ విభాగపు విధానాల సామర్థ్యాలను తెలియజేస్తుందని ఎండీ డాక్టర్ మన్నె హరీష్ వివరించారు.

సైకిల్‌పై కలెక్టరేట్‌కు అధికారులు



సైకిల్‌పై కలెక్టరేట్‌కు వెళ్తున్న డీఆర్వో సీసీ తూము వెంకటేశ్వరరావు

మచిలీపట్నం టౌన్/చల్లపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా కలెక్టరేట్‌కు కలెక్టర్ బాలాజీతో పాటు వివిధ శాఖల అధికారులు సైకిళ్లపై వచ్చి శనివారం విధులకు హాజర య్యారు. ప్రతి శనివారం ఇలా సైకిళ్లపై రావాలని కలెక్టర్ సూచించారు.

చల్లపల్లి నుంచి కలెక్టరేట్‌కు..

స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్త, డీఆర్వో సీసీ తూము వెంకటేశ్వరరావు సైకిల్‌పై చల్లపల్లి నుంచి కలెక్టరేట్‌కు వెళ్లి విధులకు హాజరయ్యారు. హెల్మెట్ వినియోగంలోనూ గతంలో కలెక్టర్ నుంచి ప్రశంసలు అందుకున్నారు.

పర్వతారోహకుడు అనుమోలుకు సన్మానం



అనుమోలు ప్రభాకరరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తదితరులు

పెనమలూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఎల్బ్రస్ పర్వతాన్ని అధిరోహించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో పేరు సంపాదించిన పోరంకి వాసి, టీడీపీ సీనియర్ నాయకుడు అనుమోలు ప్రభాకరరావును ఎమ్మెల్యే బోడె ప్రసాద్ టీడీపీ నేతలతో కలిసి అభినందించారు. పోరంకి టీడీపీ కార్యాలయంలో శనివారం ఘనంగా సత్కరించారు. 67 ఏళ్ల వయస్సులో ప్రపంచంలోనే ఎత్తయిన ఎవరెస్టు బేస్ క్యాంపు, కిలిమంజారో, ఎల్బ్రస్ లాంటి పర్వతాలను అవలీలగా అధిరోహించిన అనుమోలు యువతకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. అనుమోలు మున్ముందు మరిన్ని రికార్డులు నెలకొల్పాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జువ్వాది రాంబాబు, వెలగపూడి శంకరబాబు, కోయ ఆనంద్‌ప్రసాద్, వల్లభనేని నాని, కుర్రా నరేంద్ర, పీతా గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

చలో సింగపూర్

(5వ పేజీ తరువాయి)

ప్రారంభించారు. ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంతరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు గూడపాటి తులసీమోహన్ పాల్గొన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కేక్ కట్ చేశారు. అనంతరం ఇండిగో విమానానికి జెండా ఊపి సింగపూర్‌కు ప్రారంభించారు. శనివారం ఉదయం 7.30 గంటలకు 140 మంది ప్రయాణికులతో ఈ విమానం ఇక్కడికి వచ్చింది. అనంతరం 10.30 గంటలకు 123 మంది ప్రయాణికులతో సింగపూర్ వెళ్లింది.

సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు

సింగపూర్ నుంచి విజయవాడ వచ్చిన ప్రయాణికులు, విజయవాడ నుంచి సింగపూర్ వెళ్తున్న ప్రయాణికులు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఫొటోలతో కూడిన మినీ పోస్టర్లను ప్రదర్శించారు. వారిద్దరికీ కృతజ్ఞతలు తెలిపారు.

విజయవాడ ఎయిర్‌పోర్టుకు పూర్వవైభవం : యార్లగడ్డ వెంకట్రావు

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల గతంలో విజయవాడ ఎయిర్‌పోర్టుకు వచ్చే విమానాల సంఖ్య తగ్గిందని, ప్రస్తుతం 45 విమానాలు తిరుగుతున్నాయని, రోజూ 4 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. 50 శాతం విమానాలు పెరిగాయని చెప్పారు. గతంలో టీడీపీ హయాంలో సింగపూర్‌కు విమానం తిరిగేదని, వైసీపీ దానిని రద్దు చేసిందని చెప్పారు. తాజాగా కేంద్రమంత్రి రామ్మోహననాయుడు చొరవతో ఇండిగో విమాన సంస్థ ముందుకొచ్చి సింగపూర్‌కు సర్వీసు నడుపుతోందన్నారు. కృష్ణా, గుంటూరు, గోదావరి, ప్రకాశం ఉమ్మడి జిల్లాల్లోనే ఎన్నారైలు ఎక్కువగా ఉన్నారని, వారికి రాకపోకలు సాగించేందుకు దగ్గరగా ఉంటుందన్నారు. విమానాశ్రయానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు. రాబోయే 7 నెలల్లో అంతర్జాతీయ టెర్మినల్ నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభోత్సవానికి సిద్ధమవుతుందని తెలిపారు.

సంతోషంగా ఉంది : ప్రయాణికుడు

గన్నవరం విమానాశ్రయం నుంచి సింగపూర్‌కు విమాన సర్వీసును ప్రారంభించటం సంతోషం. ఐదేళ్ల తరువాత మళ్లీ సింగపూర్ సర్వీసును ఏర్పాటు చేయటం బాగుంది. ఇంతకుముందు చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వెళ్లి సింగపూర్ వెళ్లాల్సి వచ్చేంది. ఇప్పుడు డైరెక్ట్‌గా సింగపూర్ విమానం ఎక్కడం హ్యాపీగా ఉంది.

కనీస సౌకర్యాలు కరువు

జగనన్నకాలనీల్లో అంతా మొక్కుబడి తంతే!

- కప్తానుపాలెం శివారులో ఇళ్ల స్థలాలకు పంచిన డొంకదారి
- లోతట్టు ప్రాంతంలో కె.కొత్తపాలెం లే అవుట్
- ఇళ్లు నిర్మించుకుందామన్నా అవకాశం లేక లబ్ధిదారుల అవస్థలు
- కొక్కిలిగడ్డలో రహదారి లేక మురుగులోనే రాకపోకలు
- గత వైసీపీ ప్రభుత్వం తీరుపై విమర్శలు.. కూటమి ప్రభుత్వం చొరవచూపాలని వేడుకోలు

> అర్హులైన పేదలందరికీ నివేశనాస్థలాలు, పక్కా ఇళ్లు అంటూ ప్రచార ఆర్భాటం చేసిన గత వైసీపీ ప్రభుత్వం ఇళ్ల స్థలాల పంపిణీలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. డొంకలు, లోతట్టు ప్రాంతాల్లోని వ్యవసాయ భూములను ఇళ్ల స్థలాలుగా ఇచ్చింది. కనీస సౌకర్యాలు కల్పించడం మరచింది. దీంతో నాటి నుంచి నేటి వరకు అక్కడ ఇళ్లు నిర్మించుకుందామనుకునే లబ్ధిదారులు అవకాశం లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. గత పాలకుల తీరుపై విమర్శలు చేస్తూ, కూటమి ప్రభుత్వం చొరవచూపాలని వేడుకుంటున్నారు.



ముళ్ల చెట్లతో నిండిన మోపిదేవి మండలం కె.కొత్తపాలెంలోని జగనన్న లే అవుట్



కప్తానుపాలెం వద్ద పేదలకు కేటాయించిన డొంక పోరంబోకు భూమి ఇదే



కె.కొత్తపాలెం వద్ద ఇళ్ల స్థలాల్లోకి వెళ్లే రహదారిని కమ్మేసిన ముళ్ల చెట్లు

ఆంధ్రజ్యోతి-మోపిదేవి : మోపిదేవి మండలంలోని కె.కొత్తపాలెం, పెదప్రోలు, కొక్కిలిగడ్డ, మోపిదేవి గ్రామాల్లో గత వైసీపీ ప్రభుత్వంలో లక్షల రూపాయలు వెచ్చించి భూములను కొనుగోలు చేసి పేదలకు నివేశనాస్థలాలు పంపిణీ చేశారు. వాటిలో గృహాలు నిర్మించుకునేందుకు, నివాసముండేందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించటంలో నాటి పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం వహించారు. పెదప్రోలు పంచాయతీ పరిధిలోని కప్తానుపాలెం శివారులో శివరామపురం, పెదప్రోలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు రైతులు వ్యవసాయ భూముల్లోకి వెళ్లేందుకు వినియోగించే డొంక దారిని నివేశనా స్థలాలకు ఎంపిక చేశారు. స్థలంలోకి వెళ్లేందుకు దారి కూడా లేక మురుగు కాల్వలో నుంచి వెళ్లాల్సి ఉంది. నాటి నుంచి నేటి వరకు ప్రభుత్వ అధికారులు, నివేశనాస్థలాల్లోకి వెళ్లేందుకు తూము కల్వర్టు కూడా ఏర్పాటు చేయకపోవటంతో ఒక్క లబ్ధిదారుడు కూడా గృహం నిర్మించుకునేందుకు వీలు లేకుండా ఉంది. గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో పేదలు నివేశనాస్థలాలు పొందలేక నేటికీ తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోంది. కె.కొత్తపాలెంలోని చిన్నవంతెన సమీపంలో ఏర్పాటు చేసిన లేఅవుట్ వ్యవసాయ భూమి అయినందున వర్షాకాలంలో మోకాలి లోతు నీరు నిలిచి ఉంటున్నాయి. వాహనంలో ఇంటి నిర్మాణానికి అవసరమైన మెటీరియల్ తీసుకెళ్లేందుకు కూడా వీలు లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు సంవత్సరాలుగా లే అవుట్‌లో కనీస వసతులు, రహదారి సౌకర్యం కల్పించకపోవటంతో తుమ్మ ముళ్ల చెట్లు దట్టంగా పెరిగి కొద్దిపాటి అడవిని తలపించేలా లే అవుట్ దర్శనమిస్తోంది. కూటమి ప్రభుత్వంలోనైనా రహదారి, మౌలిక వసతులు కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. కొక్కిలిగడ్డలో ఏర్పాటు చేసిన లే అవుట్‌లో 33 మంది లబ్ధిదారులకు స్థలాలు కేటాయించగా, ఇప్పటికే 12 మంది గృహాలు నిర్మించుకున్నారు. రహదారి మార్గం లేకపోవటంతో మోకాలిలోతు బురద నీటిలో వెళ్లాల్సి వస్తుందని లబ్ధిదారులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా రహదారి, ఇతర మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ముళ్ల చెట్లు దట్టంగా పెరిగాయి



కె.కొత్తపాలెం చినవంతెన సమీపంలో 67 మందికి నివేశనా స్థలాలు కేటాయించారు. రహదారి, ఇతర మౌలిక వసతులు కల్పించలేదు. ప్రస్తుతం అధికారులు పట్టించుకోకపోవటంతో ముళ్ల చెట్లు దట్టంగా పెరిగి రహదారులు, ప్లాట్లను కమ్మివేశాయి. కూటమి ప్రభుత్వం లే అవుట్‌ను బాగు చేసి మౌలిక వసతులు కల్పించాలి.

-మల్లవోలు యుగంధర్, కె.కొత్తపాలెం

మౌలిక వసతులు కల్పించాలి



నాటి వైసీపీ ప్రభుత్వం పేదలకు నివేశనాస్థలాలు కేటాయించి మౌలిక వసతులు కల్పించటంలో నిర్లక్ష్యం వహించింది. కనీసం రహదారి సౌకర్యం కూడా లేక బురదలోనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం లే అవుట్లలో మౌలిక వసతులు కల్పించాలి.

-ఏ.రాఘవేంద్రరావు, కొక్కిలిగడ్డ

42 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యం పరిశీలిస్తున్న అధికారులు

పెనమలూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గంగూరు ధనేకుల ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని ఒక గోడవున్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 42 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పోరంకికి చెందిన దేసు సాంబశివరావు ధనేకుల ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని ఒక గోడౌన్‌ను అద్దెకు తీసుకొని దానిలో ఖాళీ సంచులు, బ్యాగ్ ప్యాకింగ్ యంత్రం, 42 క్వింటాళ్ల బియ్యాన్ని ఉంచాడు. సమాచారం అందుకున్న పౌరసరఫరాల శాఖ అధికారులు శనివారం మధ్యాహ్నం గోడౌన్‌పై దాడులు నిర్వహించారు. 84 తెల్ల బ్యాగుల్లో 42 క్వింటాళ్ల బియ్యం, 117 ఖాళీ సంచులను స్వాధీనం చేసుకున్నారు. సాంబశివరావును అధికారులు ప్రశ్నించగా, తాను కంకిపాడు, ఉయ్యూరుల్లో గత యేడాది నిర్వహించిన ఆక్షన్లలో బియ్యాన్ని పాడుకున్నానని తెలిపాడు. ఆక్షన్‌కు సంబంధించిన ఆధారాలను చూపించకపోవడంతో అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని సేఫ్ కస్టడీకి తరలించి కేసు నమోదు చేశారు. దాడుల్లో పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ గోవిందరావు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి జి.మోహన్‌బాబు, తహసీల్దార్ గోపాలకృష్ణ, డీటీ ప్రధాన్ తదితరులు ఉన్నారు.

ప్రత్యక్ష రాజకీయాల్లోకి వంగవీటి కుమార్తె!

- నేడు తండ్రి రంగా విగ్రహానికి ఆశ కిరణ్ నివాళులు
- మీడియా సమావేశంలో రాజకీయ ప్రవేశంపై ఇవ్వనున్న స్పష్టత



విజయవాడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాపు నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన రంగా తనయ వంగవీటి ఆశ కిరణ్ రాజకీయ ప్రవేశం చేయబోతున్నారు. ఆదివారం ఉదయం ఏడు గంటలకు బందర్ రోడ్డులో ఉన్న తన తండ్రి రంగ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహిస్తారు. వంగవీటి రంగా తనయగా ఆశా కిరణ్ రాజకీయాల్లోకి రావాలనుకుంటున్నారు. తన రాజకీయ రంగ ప్రవేశానికి సంబంధించి అధికారికంగా స్పష్టతనివ్వడానికి ఆమె మీడియా సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. మీడియా సమావేశం ఎందుకు నిర్వహిస్తున్నారన్న అంశాన్ని ఆమె గుంభనంగా ఉంచారు. కొద్దిరోజులుగా ఆశ తన తండ్రి రంగా వెంట నడిచిన వారితో సంప్రదింపులు జరిపినట్టు సమాచారం. రాజకీయాల్లోకి రావాలనుకుంటున్నట్టు ఆమె వారి ముందు తన అభిప్రాయాన్ని చెప్పినట్టు తెలుస్తోంది. రంగా వెంట నడిచిన వారంతా ఆశ రాజకీయాల్లోకి రావాలనుకుంటున్న నిర్ణయాన్ని స్వాగతించినట్టు సమాచారం. దీంతో ఆశ తన తండ్రి స్ఫూర్తితో రాజకీయాల్లోకి ప్రవేశంతో పాటు ఏ పార్టీలో చేరే అవకాశం ఉందన్న వివరాలను కూడా తెలియపరిచే అవకాశం ఉంది. కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉంటున్న ఆశ కిరణ్ ఇటీవలే విజయవాడ వచ్చారు. విజయవాడ వచ్చిన క్రమంలో ఆమె ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

కూలిన వందేళ్ల నాటి వంతెన

- కంకరు లోడుతో లారీ వెళ్తుండగా ఘటన
- పది గ్రామాల ప్రజల రాకపోకలకు ఆటంకం



పాములపాడు వద్ద కూలిన వంతెన

పెదపారుపూడి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పెదపారుపూడి మండలం పాములపాడు వద్ద దోసపాడు చానల్‌పై సుమారు 100 సంవత్సరాల క్రితం నిర్మించిన పాములపాడు వంతెన శుక్రవారం రాత్రి కూలిపోయింది. సుమారు 40 టన్నుల కంకరు లోడుతో లారీ వెళ్తుండగా ఘటన జరిగింది. లారీలోని కంకర మొత్తం కాలువలో పడిపోయింది. ఈ వంతెన కూలిపోవటంతో 10 గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. పాములపాడు, రావులపాడు, దోసపాడు, దూళ్లవానిగూడెం గ్రామాల ప్రజలు నిత్యం ఈ వంతెనపై రాకపోకలు సాగిస్తుంటారు. దోసపాడులో రైల్వే స్టేషన్ ఉండటంతో ఈ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు, విద్యార్థులు విజయవాడ, గుడివాడలో ఉద్యోగాలు చేసుకునేవారు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఈ వంతెన మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. ఈ వంతెన కూలి పోవటంతో ఆయా గ్రామాల ప్రజలు చుట్టూ ఐదారు కిలోమీటర్లు తిరిగి రావాల్సి ఉంది. గతంలో అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసు కెళ్లినా పట్టించుకోకపోవటంతో ఈ రోజు ఈ పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా అధిక లోడు వాహనాల రాకపోకలు నిలిపి వేసి ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వేగవంతంగా వంతెనకు మరమ్మతులు చేసి వాడుకలోకి తీసుకు రావాలని కోరుతున్నారు.

పరిశుభ్రతతో మానసిక, శారీరక ఆరోగ్యం

మచిలీపట్నం టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత, పచ్చదనంతో మానసిక, శారీరక ఆరోగ్యం లభిస్తుందని కలెక్టర్ బాలాజీ అన్నారు. శనివారం కలెక్టరేట్ పరిధిలో వివిధ కార్యాలయాల వద్ద కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది శ్రమదానం నిర్వహించారు. కలెక్టర్ బాలాజీ స్వయంగా చెత్త ఏరి డస్ట్‌బిన్‌లలో వేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో కె.చంద్రశేఖర్, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి షాహిద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషాభివృద్ధికి మండలి విశేష కృషి

- రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు గొనుగుంట్ల కోటేశ్వరరావు
- ఏడుగురికి కృష్ణారావు శత జయంతి ఉత్సవ పురస్కారాల ప్రదానం



బసవేశ్వరరావును అవార్డుతో సత్కరిస్తున్న బుద్ధప్రసాద్,బండి

మచిలీపట్నం టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషాభివృద్ధికి మాజీ మంత్రి మండలి వెంకటకృష్ణారావు విశేష కృషి చేశారని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు గొనుగుంట్ల కోటేశ్వరరావు కొనియాడారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా భారతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవ పురస్కారాల ప్రదానం శనివారం రాత్రి జరిగింది. పరిషత్ అధ్యక్షుడు కారుమూరి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించిన సభలో పరిషత్ అధ్యక్షుడు కోటేశ్వరరావు, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ హసీంబేగ్, కృష్ణా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎన్.ఉష తదితరులు కృష్ణారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రపంచ రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, కృష్ణావిశ్వవిద్యాలయం రెక్టార్ బసవేశ్వరరావు, వాంగ్మయి వ్యవస్థాపకుడు డాక్టర్ చింతలపాటి మురళీకృష్ణ, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా విద్యానిధి కన్వీనర్ పి.శ్రీరామ్, తెలుగు భాషా వికాస సమితి సమన్వయకర్త డి.ఆర్.బి.ప్రసాద్, ప్రముఖ నాట్యాచార్యుడు ఏలేశ్వరపు పూర్ణచంద్రరావు, ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ కుప్పా రామశాస్త్రిలకు పురస్కారాలు ప్రదానం చేశారు. వీరితో పాటు మైక్రో చిత్రకారుడు గేదెల అప్పారావు, కార్టూనిస్టు మల్లాడి దుర్గారావు, భగవద్గీత ఉపన్యాసకురాలు జొన్నలగడ్డ మాధవిలకు ప్రశంసాపత్రాలు అందచేసి ఘనంగా సత్కరించారు. సిరికవి డాక్టర్ చింతలపాటి మురళీకృష్ణ రచించిన లక్ష్మణయతీంద్రుల కావ్యాలు అనుశీలన అనే పరిశోధనాత్మక గ్రంథాన్ని మండలి బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు.

భవనాల్లో భయంగా..

(5వ పేజీ తరువాయి)

నడుపుతున్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలోని మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయం పాతభవనంలోనే నడుస్తోంది. మొంథా తుఫాను, అంతకు ముందు వాయుగుండం ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ఈ కార్యాలయ ప్రాంగణంలో నీరు నిలబడిపోయింది. దీంతో కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. ఆర్డీవో కార్యాలయం పక్కనే ఉన్న ఖాళీస్థలంలో నూతన భవన నిర్మాణ పనులను ప్రారంభించి, పునాదుల దశ వరకు పనులు చేసి నిలిపేశారు. ఆర్డీవో, మచిలీపట్నం నార్త్ మండల తహసీల్దార్ కార్యాలయాల్లో రికార్డు రూమ్‌లు ఉన్నాయి. వీటిలో రెవెన్యూకు సంబంధించిన పాత రికార్డులు ఉండగా, వర్షపునీరు రికార్డు రూముల్లోనే పడుతుండటంతో విలువైన పత్రాలు పాడైపోతున్నాయి. ఒక్కో తహసీల్దార్ కార్యాలయం లేదా ఆర్డీవో కార్యాలయంలో రోజుకు కనీసం రెండు బండిల్స్‌కు సరిపడా పత్రాలు తయారవుతూ ఉంటాయని, వాటిని భవిష్యత్ అవసరాల కోసం రికార్డు రూమ్‌లో భద్రపరుస్తామని, రికార్డు రూమ్‌లు శిథిలావస్థకు చేరడంతో విలువైన పత్రాలు పాడైపోతున్నాయని అధికారులు చెబుతున్నారు.

మార్కెట్‌యార్డు గదుల్లో ఉయ్యూరు ఆర్డీవో కార్యాలయం

జిల్లాల విభజన జరిగిన సమయంలో ఉయ్యూరు రెవెన్యూ డివిజన్‌ను కొత్తగా ఏర్పాటు చేశారు. అయినా ఇక్కడి ఆర్డీవో కార్యాలయానికి సొంత భవనం లేదు. దీంతో ఉయ్యూరు మార్కెట్ యార్డులోని భవనాల్లో కొన్ని గదులను అద్దెకు తీసుకుని నడుపుతున్నారు.

చల్లపల్లి, బంటుమిల్లి తహసీల్దార్ కార్యాలయాలు శిథిలావస్థకు..

చల్లపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని 1988లో నిర్మించారు. ఈ భవనం శిథిలావస్థకు చేరి శ్లాబు పెచ్చులు ఊడి పడుతున్నాయి. ఈ భవనాన్ని పనికి రాదని, కూలగొట్టాలని గతంలోనే ఇంజనీరింగ్ అధికారులు సిఫార్సు చేశారు. అయినా ఈ భవనంలోనే నడుపుతున్నారు. ఇటీవల సీనియర్ అసిస్టెంట్ టేబుల్‌పై శ్లాబు పెచ్చులూడి పడింది. అక్కడెవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. బంటుమిల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని బంటుమిల్లి సబ్‌ట్రెజరీ కార్యాలయం లో నడుపుతున్నారు. పాత భవనం కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఈ తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణం 2018లో ప్రారంభిం చి శ్లాబ్ దశ వరకు నిర్మించారు. వైసీపీ అధికారంలోకి రావడంతో ఈ భవన నిర్మాణాన్ని నిలిపివేశారు.

పోలీస్ కస్టడీకి 'అద్విక' నిందితులు

విజయవాడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రూ.లక్ష ఇవ్వండి నెలకు రూ.6వేలు వడ్డీ పొందండి అంటూ పెట్టుబడులు సేకరించి బోర్డు తిప్పేసిన అద్విక ట్రేడింగ్ అండ్ ప్రైవేటు లిమిటెడ్ కేసులో లెక్కలను పూర్తిస్థాయిలో తేల్చడానికి పోలీసులు సిద్ధమయ్యారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు తాడేపల్లి శ్రీ వెంకట ఆదిత్య, అతడి భార్య సుజాత, ఏజెంట్ బాలకృష్ణను పోలీసులు విజయవాడ జైలు నుంచి శనివారం కస్టడీకి తీసుకున్నారు. ముందుగా వారికి విజయవాడలోని ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం సెంట్రల్ జోన్ ఏసీపీ కార్యాలయంలో విచారించారు. సుమారుగా 50 ప్రశ్నలు వారికి సంధించారు. క్రైమ్స్ డీసీపీ పి.తిరుమలేశ్వరరెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ లతాకుమార్, సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదరరావు ముగ్గురు నిందితులను విచారించారు. ముఖ్యంగా దుబాయ్‌లో కబానా ట్రేడింగ్ కంపెనీకి మళ్లించిన నిధుల గురించి ప్రశ్నించినట్టు తెలిసింది. ప్రస్తుతం ఈ ఖాతాలో ఎలాంటి నిధులు లేవని చెప్పినట్టు సమాచారం. వాస్తవానికి ఖాతాదారులు, ఏజెంట్ల నుంచి సేకరించిన నిధులను హవాలా మార్గంలో కబానా సంస్థకు మళ్లించాడు. చాలా ప్రశ్నలకు ఆదిత్య అతి తెలివిగా సమాధానాలు ఇచ్చినట్టు తెలిసింది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 600

ఇన్ఫోసిస్‌కు ధనేకుల విద్యార్థినుల ఎంపిక



పెనమలూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గంగూరులోని ధనేకుల ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 19 మంది విద్యార్థినులు ఇన్ఫోసిస్ కంపెనీలో ఉద్యోగాలు పొందినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రవి కడియాల తెలిపారు. ఏపీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇన్ఫోసిస్ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన ఎంపికల్లో 3.6 లక్షల వార్షిక వేతనంతో వారు ఈ అవకాశం పొందినట్లు తెలిపారు. విద్యార్థినులను చైర్మన్ ధనేకుల రవీంద్రనాధ్ ఠాగూర్, సెక్రటరీ భవానీప్రసాద్, డైరెక్టర్ రవిప్రసాద్, డీన్లు అభినందించారు.

గోనెసంచులు అందుబాటులో ఉంచాలి

కలెక్టర్ డీకే బాలాజీ




పునాదిపాడు ధాన్యం కొనుగోలు కేంద్రంలో గోనెసంచులు పరిశీలిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ తదితరులు.. చిన ఓగిరాలలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

కంకిపాడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన గోనెసంచులు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ డీకే బాలాజీ సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలంలోని పునాదిపాడు, ఉప్పలూరు, కోలవెన్ను గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరిస్తున్న ధాన్యంకు సంబంధించి రైతులను ఇబ్బందులు పెట్టవద్దు అంటూ అధికారులను ఆదేశించారు. రైతులకు అవసరమైన గోనెసంచులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీ వర్షం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని, రైతులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భవన్నారాయణ, మండల వ్యవసాయ శాఖ అధికారి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవాకేంద్రాల పరిశీలన

ఉయ్యూరు : ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతు సేవా కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. చినఓగిరాల, కాటూరులో రైతు సేవా కేంద్రాలను శనివారం పరిశీలించి ఇప్పటి వరకు జరిగిన ధాన్యం కొనుగోలు వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన ఓగిరాలలో పీఏసీఎస్ అధ్యక్షుడు రామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు, జబర్లపూడి సర్పంచ్ సూరపనేని ప్రసాద్, రైతులు కలెక్టర్‌ను కలసి గోనెసంచులు, ధాన్యం రవాణాకు అవసరమైన వాహనాలు ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కాటూరులో టీడీపీ నాయకుడు వేమూరు శ్రీనివాసరావు, ఇతర నాయకులు, రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు సంబంధించి సమస్యలు తెలుసుకున్నారు.

భగవాన్ బిర్సాముండా జీవితం ఆదర్శనీయం



హనుమాన్‌జంక్షన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య ఉద్యమంతో పాటు ఆదివాసీల హక్కుల కోసం కృషి చేసిన భగవాన్ బిర్సా ముండా జీవితం ఆదర్శనీయమని జనవిజ్ఞాన వేదిక బాపులపాడు మండల నాయకులు ద్వారపురెడ్డి భాస్కరరావు అన్నారు. శనివారం బిర్సా జయంతిని స్థానిక గీతాంజలి హైస్కూల్‌లో జేవీవీ మండల అధ్యక్షుడు వీడీఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాలకు చెందిన పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సహస్ర దీపోత్సవం

హనుమాన్‌జంక్షన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాస బహుళ ఏకాదశిని పురస్కరించుకొని శనివారం స్థానిక లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సహస్ర దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో కృష్ణ కిషోర్ పర్యవేక్షణలో అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు దీపోత్సవాన్ని వేడుకగా జరిపారు. దీపోత్సవానికి ముందు అర్చకులు ఆకాశ దీపానికి పూజలు నిర్వహించారు. అనంతరం కార్తీక దీపాలు వెలిగించారు.

వాసవీ మాత ఆలయంలో కైలాస గౌరీ నోము

స్థానిక ఏలూరు రోడ్డులోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శనివారం కార్తీక బహుళ ఏకాదశిని పురస్కరించుకొని కైలాస గౌరీ నోము నిర్వహించారు. ఆర్యవైశ్య నేతలు కొత్తమాసు మల్లేశ్వరావు, వరలక్ష్మి దంపతులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆర్య వైశ్య సంఘం, వాసవీ మాత ఆలయ కమిటీ నేతలు బొమ్మిశెట్టి రామారావు, వెత్సా వెంకటేశ్వరరావు, నారికమల్లి ప్రసాద్, గార్లపాటి రామకృష్ణ, తదితరులు పర్యవేక్షించారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

పెనమలూరు : యనమలకుదురు కొండపై వేంచేసిన విఘ్నేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా వంద జంటలతో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరింపజేశారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు గోపాల్, ఆలయ ఛైర్మన్ చిగురుపాటి సాంబశివరావు, కమిటీ సభ్యులు రాజారావు, మొక్కపాటి శ్రీనివాస్, రావి రామారావు,రాజు పాల్గొన్నారు.




చినఓగిరాల, ముస్తాబాద పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

చినఓగిరాల, ముస్తాబాదలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర

ఉయ్యూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత పాటించి స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర సాధనలో భాగస్వాములుమవుదామని చినఓగిరాల సర్పంచ్ యెనిగళ్ల శిరీష అన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో శేషగిరిరావు, తహసీల్దార్ సురేశ్ కుమార్, ఏఎంసీ ఛైర్మన్ ప్రవీణ్‌కుమార్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు. ● వ్యక్తిగత, సామాజిక పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధులకు దూరంగా ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం చినఓగిరాలలో ర్యాలీ నిర్వహించి బాలికల ఆరోగ్యం పాటించవలసిన పారిశుధ్య పద్ధతులపై అవగాహన కల్పించి చేతులు శుభ్రపరుచుకోవడం తదితర అంశాలను వైద్య సిబ్బంది తెలియజేశారు.

గన్నవరం : ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ పర్వతనేని శ్రీహర్ష అన్నారు. మండలంలోని ముస్తాబాద పీహెచ్‌సీ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర ర్యాలీని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ, పరిసరాల పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. స్వచ్ఛమైన వాతావరణం ఉండేలా చూసుకోవాలన్నారు. అలాగే కుష్టు వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ సృజన, పీహెచ్‌ఎన్ జయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దంపతులు

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే యార్లగడ్డ దంపతులు

విజయవాడ రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నున్న శ్రీఅభయ అంజనేయస్వామి ఆలయంలో శనివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దంపతులు హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఖానస ఆగమ వ్యవస్థాపకుడు శ్రీమాన్ నల్లూరి జగదీష్‌కుమార్, ఆగమ ప్రవర శ్రీమాన్ రొంపిచర్ల హనుమంతాచార్యులు నూతన ధ్వజస్తంభానికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో స్వామి వారికి రుత్విక బృందం, వేద పండితులు మహాపూర్ణాహుతి, కుంభాబిషేకం, ధ్యాన, గోకన్య దర్శనం, నాగాదాసార్చన, హరతి, మంత్రపుష్పం తదితర పూజలు వంటి విశిష్ట పూజలు జరిగాయి. ఆలయ కమిటీ సభ్యులు, నున్న పోలీసు స్టేషన్ సీఐ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి ఆరోగ్యంపై ఎమ్మెల్యే యార్లగడ్డ ఆరా

హనుమాన్‌జంక్షన్‌రూరల్: తిప్పనగుంటకు చెందిన చిన్నారికి వెన్నపూస శస్త్రచికిత్స జరగడంతో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు శనివారం పరామర్శించారు. తిప్పనగుంటకు చెందిన 17 నెలల చిన్నారి కొడాలి రుద్రాన్షుకు పుట్టుకతోనే వెన్నుపూసపై చిన్నగడ్డ ఉండి వయస్సుతో పాటు పెరుగుతోంది. ఇది గమనించిన తల్లిదండ్రులు స్థానిక డీసీ ఛైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్ ద్వారా ఎమ్మెల్యే యార్లగడ్డను వైద్య సహాయం కోరారు. తక్షణం స్పందించిన ఎమ్మెల్యే సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.3లక్షల నిధులు మంజూరు చేయించడంతో ఇటీవలే చిన్నారికి అను హాస్పిటల్‌లో వైద్యులు శస్త్రచికిత్స చేశారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆసుపత్రికి వెళ్లి చిన్నారి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. తల్లిదండ్రులతో మాట్లాడి చిన్నారికి అవసరమైన వైద్యసాయం అందేలా చూస్తానని భరోసా కల్పించారు.

బీపీఎస్‌కు దరఖాస్తు చేసుకోవాలి

కానూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తాడిగడప మున్సిపాలిటీలో అనధికార భవనాల క్రమబద్ధీకరణకు బిల్డింగ్ ప్లీనలైజేషన్ స్కీమ్ (బీపీఎస్)కు నాలుగు నెలల్లో దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్ చెప్పారు. శనివారం ఆయన కానూరులో విలేఖరులతో మాట్లాడుతూ, తాడి గడప మున్సిపాలిటీలోని కానూరు, తాడిగడప, పోరంకి, యనమలకుదురు గ్రామాల పరిధిలో ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ లోపు నిర్మించిన అనధికార భవనాలకు మాత్రమే ఈపథకం వర్తిస్తుందని పేర్కొన్నారు. భవన యజమానులు ఈ అవకాశం వినియోగించుకోని ప్రయోజనం పొందాలని ఆయన సూచించారు. లేకుంటే ఆయా భవనాలకు ప్రభుత్వం నుంచి వచ్చే వసతులేమి కల్పించమని పేర్కొన్నారు.

కియా ఓనర్షిప్ సర్వీస్ క్యాంప్ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డైరెక్టర్ రావెళ్ల తారక రస్య

భారతీనగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కియా అధీకృత డీలర్ సింహ కియా తమ విజయవాడ షోరూంలో ఓనర్ షిప్ సర్వీస్ క్యాంప్‌ను సింహ మోటార్స్ డైరెక్టర్ రావెళ్ల తారక రస్య శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రస్య మాట్లాడుతూ, నేటి నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ క్యాంప్‌లో కస్టమర్ల కోసం కారు బాడీ వాష్, కారు కేర్ సర్వీస్‌లో 20శాతం తగ్గింపు, కాంప్లిమెంటరీ వెహికల్ హెల్త్ చెకప్, యాక్సెసరీస్‌లో 10శాతం తగ్గింపు, కారు ఎక్స్ఛేంజ్ ఉచిత ఎవాల్యూవేషన్ వంటి పలు రకాల ఆఫర్స్‌ను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సదుపాయాలను కియా కస్టమర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 8688836577, 7799981533 ఈ ఫోన్‌నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

విద్యార్థులు పఠనాశక్తిని పెంచుకోవాలి

గన్నవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పఠనాశక్తిని పెంచుకోవాలని సీఐ బీవీ శివ ప్రసాద్ అన్నారు. స్థానిక గ్రేడ్-1 గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా శనివారం పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. ఎస్సై కిషోర్, అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షు లు గన్నె వెంకట్రావు, కమిటీ సభ్యులు పడమట శోభారాణి, కె.ధర్మారావు, గ్రంథాలయ అధికారి కె.నాగరాజు, దుర్గలక్ష్మీ పాల్గొ న్నారు. పురుషోత్తపట్నం, ము స్తాబాద గ్రంథాలయాల్లో కార్యక్ర మాలు నిర్వహించారు. **ఉయ్యూరు :** గ్రంథాలయాలను ఉప యోగించుకోవడం చిన్ననాటి నుంచి అలవాటు చేసుకుని విజ్ఞానవంతులై సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఎంఈవో ఎస్‌డీ సాగర్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఉయ్యూరు గ్రంథాలయంలో శనివారం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన ఎంఈవో ప్రారంభించారు. గ్రంథాలయాధికారి బి.రమణి, పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్ : పుస్తకాలు సృజనాత్మకతను పెంచడంతో పాటు విమర్శానాత్మక ఆలోచనా నైపుణ్యాన్ని పెంపొందిస్తాయని డాక్టర్ వాహిని సూచించారు. కానుమోలులో గ్రంథాలయాధికారి రహీం ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

ఘనంగా వనసమారాధన

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మిక ఐక్యతకు ప్రతీకగా ఆలయ ప్రాగణంలో వనసమారాధన నిర్వహించామని కోశాధికారి పరుచూరి సుకన్య తెలిపారు. రంగయ్య ప్పారావుపేటలోని శ్రీకోదండరామస్వామి దేవాలయంలో శనివారం ఘనంగా వనసమారాధన కార్యక్రమం నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజల నంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. 350 మందికిపైగా భక్తులు అన్నప్రసాద వితరణలో పాల్గొన్నారు. హనుమాన్ రైస్ ట్రేడర్స్ అధినేత పొట్లూరి సీతారాం ప్రసాద్, మారుతీరైస్ ట్రేడర్స్ అధినేత పొట్లూరి వెంకటేశ్వరరావు, రాము ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అభివృద్ధి కమిటీ సభ్యులు లింగం పిచ్చేశ్వరరావు, పరుచూరి రామకృష్ణ, దొడ్డపనేని సుశీల, రత్నమాణిక్యం, ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తల్లిదండ్రులకు పాదపూజ

విద్యార్థులకు చదువుతో పాటు వ్యక్తిత్వం, సంస్కారం ముఖ్యమని అం దులో ముఖ్యంగా కుటుంబ పెద్దలైన తల్లిదండ్రులను గౌరవించాల్సిన బాధ్యతను తెలియజేసేలా పాదపూజ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ డోలా సుధాకర్ అన్నారు. వీరవల్లి విశ్వభారతి హైస్కూల్ ప్రిన్సిపాల్ ఫిరోజ్ ఆధ్వర్యంలో శనివారం తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. వైద్యుడు ప్రణయ్ సాగర్, ప్రసన్న పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 600

నేడు వనసమారాధన

గుడివాడ : దనియాలపేట రైల్వే గేటు వద్ద గల పాత వాసమాంబ రైసుమిల్లులో కార్తీక వనసమారాధన నిర్వహిస్తున్నట్లు కాపు సంఘం నాయకులు సుంకర గాంధీ తెలిపారు. సంఘస్తులు పాల్గొనాల్సిందిగా కోరారు.

సాహితీవేత్త డీఆర్‌బీకి మండలి పురస్కారం

గుడివాడ : పట్టణానికి చెందిన సాహితీవేత్త తెలుగు భాషా వికాస సమితి సమన్వయకర్త డీఆర్‌బీ ప్రసాద్ కీర్తిశేషులు మండలి వెంకట కృష్ణారావు శత జయంతి పురస్కారానికి ఎంపికయ్యారు. పురస్కార గ్రహీత డీఆర్‌బీను డా.కొడాలి సోమసుందరరావు, త్రిభాషా కవి హెచ్.ఆర్ చంద్రం, వాసవీ క్లబ్ నాయకులు గాదె మోహన్‌బాబు, సయ్యద్ గఫార్ అభినందించారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా



పమిడిముక్కలలో సీఎంఆర్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వర్ల

పామర్రు,నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడే పేదకుటుంబాలకు సీఎం సహాయనిధి గొప్ప వరమని దానినుంచి అందిస్తున్న ఆర్థిక చేయూతను అందుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా నిలవాలని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. ఎమ్మెల్యే సిఫార్సులతో పట్టణంలో అనారోగ్య బాధితులైన బోల్లా నాగలక్ష్మిరూ:21,166, వేముల ఉదయ్ కిరణ్‌కు రూ85వేలు, చోప్పకట్ల రమేష్‌కు రూ75,734 మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను వర్ల వారి ఇళ్ల వద్దకు వచ్చి అందజేశారు

● పెదపారుపూడి : పెదపారుపూడి మండల పరిధిలోని వేర్వే గ్రామాల్లో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా స్వయంగా లబ్ధిదారులకు అందజేశారు. మండల పరిధిలోని అప్పికట్ల గ్రామానికి చెందిన శాయల ప్రమీల రాణికి రూ.30,028లు, జువ్వనపూడికి చెందిన చిలక అంకమ్మ రూ.28,800లు వంతున మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

● పమిడిముక్కల : పేద, మధ్యతరగతి ప్రజలు కార్పొరేట్ వైద్యశాలల్లో వైద్య ఖర్చులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్థికసాయం అందజేస్తూ ఆదుకొంటున్నారని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. పమిడిముక్కలలో చోడవరపు రజనికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ. 44,180 చెక్కును శనివారం ఆమె నివాసంలో అందజేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడ్కో గ్రీవెన్స్‌లో 102 అర్జీలు

● మున్సిపల్ కమిషనర్ మనోహర్



గుడివాడ, నవంబరు15 (ఆంధ్రజ్యోతి) : టిడ్కో కాలనీలో రిజిస్ట్రేషన్ కానీ, మార్ట్‌గేజ్ కానీ, రిజిస్ట్రేషన్ పూర్తై ప్లాట్‌లు అందనివారు, టిడ్కోకు సంబంధించి ఇతర సమస్యలపై శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రత్యేక టిడ్కో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ గ్రీవెన్స్‌లో 102 మంది లబ్ధిదారులు హాజరై వివిధ అంశాలపై అర్జీలను అందజేశారని, వచ్చిన సమస్యల పరిష్కారం చూపి సాధ్యమైన త్వరగా వారికి ప్లాట్‌లను అందజేస్తామని కమిషనర్ మనోహర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఏసుబాబు, మున్సిపల్, టిడ్కో, టౌన్ ప్లానింగ్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

కొండాలమ్మకు వెండి నాగహారతి బహూకరణ



గుడ్లవల్లేరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వేమవరం శ్రీకొండాలమ్మ అమ్మవారికి గూడూరుకు చెందిన భక్తులు పోతన వెంకట సునీల వెండి నాగహారతిని కానుకగా బహూకరించారు. రూ. 33,200 విలువగల 200 గ్రాముల వెండి నాగ హారతి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణుమోహన్‌కు అందజేశారని ఈవో ఆకుల కొండలరావు తెలిపారు.

బాలాత్రిపుర సుందరిదేవికి గాజుల అలంకరణ



కూచిపూడి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా కూచిపూడిలోని శ్రీ బాలా త్రిపుర సుందరిదేవి అమ్మవారు గాజుల అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు పెనుమూడి పూర్ణచంద్రశేఖరశర్మ, సతీష్ కుమార్ శర్మల ఆధ్వర్యంలో అభిషేకాలు, అలంకరణ, విశేషపూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

గుడివాడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీలకే పరిమితమైందని, పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్లు ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఏలూరురోడ్డులోని శ్రీవెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి సాదిక్ అధ్యక్షతన విద్యార్థుల సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సాయికుమార్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు కుళాయిస్వామి, సాబీర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

గుడ్లవల్లేరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం వడ్లమన్నాడు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామంలో పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ, ప్రతిజ్ఞ కార్యక్రమాలు చేపట్టారు. బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన చేయరాదని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కె.జ్యోతిలత, ఉపసర్పంచ్ గరికపాటి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు..

నందివాడ : స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నందివాడ సచివాలయం చుట్టూ ఎంపీడీవో మల్లేశ్వరి ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటడం, సచివాలయ వాటర్‌తో శుభ్రపర్చినట్లు మల్లేశ్వరి తెలిపారు. అనంతరం ప్రజా పరిషత్ కార్యాలయం మొక్కలు క్లీన్ చేయటం, కార్యాలయం చుట్టూ శుభ్రపరిచినట్లు ఆమె తెలిపారు.

తోట్లవల్లూరు : వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై శనివారం తోట్లవల్లూరులో అధికారులు ర్యాలీ నిర్వహించారు. తోట్లవల్లూరు సచివాలయం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీలో ఆరోగ్యవంతమైన సమాజం అందరి బాధ్యత, పరిసరాల పరిశుభ్రత మన బాధ్యత అంటు ప్ల కార్డులు చేతపట్టి నినాదాలు చేశారు. ఉయ్యూరు డీఎల్‌డీవో రాజేష్, ఎంపీడీవో రవికాంత్, ఈవోపీఆర్‌డి వెంకటేశ్వరమ్మ, కార్యదర్శి శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాల చోరీ

గుడివాడ, నవంబరు15(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ప్రభుత్వాసుపత్రిలో పార్కు చేసిన రెండు ద్విచక్ర వాహనాలు చోరీ గురైనట్లు ఒన్‌టౌన్ పోలీసులు తెలిపారు. ఒన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన బొట్టు సందీప్ ఏపి 39 సిఎన్ 4175 బైక్‌ను, పెదపారుపూడి మండలం, భూషణగుళ్ళకు చెందిన మెతికుల చిట్టిబాబుకు చెందిన ఏపి 16సిఎం 3577లను ఆసుపత్రిలో పార్కు చేసి లోపలికి వెళ్ళి తిరిగి వచ్చిచూడగా బైక్‌లు దొంగతనానికి గురయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఒన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

కోటి దీపోత్సవ ఏర్పాట్ల పరిశీలన

కూచిపూడి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మొవ్వ మండలం అయ్యంకి గ్రామంలో శివాలయం వద్ద కోటి దీపోత్సవ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దీపోత్సవ ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి భక్తులతో మాట్లాడారు. అనంతరం కోటి దీపోత్సవాన్ని మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ ఈవోగా ప్రసాద్

పమిడిముక్కల: మంటాడలో వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానాల నూతన కార్య నిర్వహణ అధికారిగా ఉయ్యూరు గ్రూపు దేవస్థానములు ఈవో వీడీడీ ప్రసాద్ శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. సిబ్బంది అభినందించారు.

రహదారికి మరమ్మతులు

గుడ్లవల్లేరు, నవంబరు 15 (ఆంధ్ర జ్యోతి) : గుడ్లవ ల్లేరు - ముదినేపల్లి ఆర్ అండ్ బీ ప్రధాన రహదారికి తాత్కాలిక మరమ్మతులు శనివారం నిర్వహించారు. గత కొన్ని సంవత్సరాలుగా పలికెడు మట్టికి కూడా ఈ రహదారి నోచుకోక భారీ గుంతలుపడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఈ రహదారిలో ప్రయాణం నరక ప్రాయం అన్న కథనం ఆంధ్రజ్యోతి లో ప్రచురించిన కథనానికి ఆర్ అండ్ బి శాఖ స్పందించింది. ఆర్ అండ్ బి సాధారణ మెయింటినెన్స్ నిధుల నుండి గోతులను ఎక్స్‌వేటర్ సహాయంతో సరిచేసి పెద్ద గోతులు ఉన్న చోట డస్ట్, కంకర, ఇసుక కలిపిన వెట్ మిక్స్‌ను నింపి సరి చేస్తున్నారు.

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి: ఎస్టీయూ

గుడివాడ, నవంబరు15 (ఆంధ్రజ్యోతి) : సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుండి మినహాయింపు యివ్వాలని జిల్లా అధ్యక్షులు పి.ఇమ్మానియేల్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎస్టీయు కార్యాలయంలో గుడివాడ రూరల్, నందివాడ, పెదపారుపూడి మండల శాఖల 79వ ఆర్థిక కౌన్సిల్ సమావేశం నిర్వహించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 600

మినుములో యాజమాన్య పద్ధతులపై శిక్షణ

మోపిదేవి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పెదప్రోలు గ్రామపంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో మినుము సాగులో అవలంబించాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శాస్త్రవేత్తల బృందం నిర్వహించింది. పంటల సాగులో అధిక మోతాదులో రసాయనాలు వినియోగిస్తున్నారని, సాగు ఖర్చు అధికమై నికర ఆదాయం తగ్గుతోందని కేవీకే ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ సుధారాణి తెలిపారు. రసాయనేతర పద్ధతులు అవలంబించి అవశేష రహిత పంట ఉత్పత్తులు పొందాలని సూచించారు. సర్పంచ్ పొలిమెట్ల ఏసుబాబు, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రేవతి, సహకార సంఘం చైర్మన్ శరత్ చంద్రబాబు, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు, రైతులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞాన సముపార్జన

వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శనలు





మచిలీపట్నం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న డీఈవో రామారావు, చల్లపల్లి గ్రంథాలయంలో పుస్తకపఠనం చేస్తున్న విద్యార్థినులు, పాఠకులు

మచిలీపట్నం టౌన్/గూడూరు/పెడన/మోపిదేవి/చల్లపల్లి/ఘంటసాల/అవనిగడ్డ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని సముపార్జించుకోవచ్చని, విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉంటూ పుస్తకపఠనంపై దృష్టి సారించాలని జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శనివారం మచిలీపట్నం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆయన పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. డిప్యూటీ లైబ్రేరియన్ బీరం వెంకటరమణ, భారతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కారుమూరి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. గూడూరు గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను జడ్పీటీసీ వేముల సురేష్‌రంగబాబు ప్రారంభించారు. ఎంఈవో సుబ్రహ్మణ్యం, బేతాళ స్వామి, మూర్తి, ధర్మేందర్ పాల్గొన్నారు. మోపిదేవిలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గండు వీరరాఘవమ్మ పుస్తక ప్రదర్శనను ప్రారంభించ గా విద్యార్థులు పుస్తకాలను తిలకించారు. గ్రంథాలయ అధికారిణి సోమలత పాల్గొన్నారు. చల్లపల్లి శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటుచేశారు. విద్యార్థులకు ఆటల పోటీలు, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి కె.గణేష్‌కుమార్ పాల్గొన్నారు. ఘంటసాల గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను ఎంపీపీ వేమూరి రజనీ కుమారి ప్రారంభించారు. గ్రంథాలయాధికారి ఎం.శరత్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కొడాలి గ్రంథాలయ అధికారి మేడంకి సుబ్బారావు ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన జరుగగా, సర్పంచ్ చలపాటి రాణి, కార్యదర్శి నాగమణి, హెచ్‌ఎం పోతన లక్ష్మేశ్వరరావు పాల్గొన్నారు. చి ట్టూర్పులో బీడీపీ గ్రంథాలయ అధికారి పరుచూరి శేషగిరిరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయిని వెంకటేశ్వరమ్మ పాల్గొన్నా రు. అవనిగడ్డలో గ్రేడ్ -1 శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు ప్రారంభించారు. సింహాద్రి రామలింగేశ్వరరావు, కొక్కిలిగడ్డ కరుణశ్రీ, గ్రంథాలయ అధికారిణి ఎ.ప్రభ, ఏవీఆర్, ఎస్‌వీఆర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. గిరిజన వీరుడు బిర్సా ముండా చిత్రపటానికి నివాళులర్పించారు. పెడన శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ బళ్ల మల్లికార్జునప్రసాద్ ప్రారంభించారు. గ్రంథాలయాధికారి షేక్ కాలేషా పాల్గొన్నారు.



మట్టి మనిషి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

మట్టి మనిషి పుస్తకావిష్కరణ

నాగాయలంక, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సమాజ హితం కోరే సాహిత్యమే ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తుందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. నాగాయలంకలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం కవి, జర్నలిస్టు జి.సూర్యనారాయణ రచించిన మట్టిమనిషి కవితా సంపుటిని బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు. సీనియర్ పాత్రికేయుడు సింహాద్రి కృష్ణప్రసాద్, దివిసీమ కవులు డాక్టర్ గుడిసేవ విష్ణు ప్రసాద్, నడకుదిటి రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు. పుస్తక దాత ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావును ఎమ్మెల్యే సత్కరించారు.



ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

25 నుంచి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి
షష్ఠి కల్యాణ మహోత్సవాలు

మోపిదేవి నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 25 నుంచి నిర్వహించనున్న సుబ్రహ్మణ్య షష్ఠి కల్యాణ మహోత్సవ ఆహ్వాన కరపత్రికలను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు. శనివారం ఆయన ఆలయానికి విచ్చేసిన ఆయన స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం ఆలయ మర్యాదాలతో స్వాగతం పలికారు. ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు మూడు రోజులపాటు షష్ఠి కళ్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని ఆలయ ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లికార్జునరావు, నియోజకవర్గ ప్రత్యేకాధికారి పెనుమూడి సాయిబాబు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వార్పు వద్ద సుందరీకరణ ఏర్పాట్ల పరిశీలన

మోపిదేవి నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మోపిదేవి వార్పు వద్ద ఏర్పాటు చేస్తున్న ఐ లవ్ దివిసీమ బోర్డును, సుందరీకరణ ఏర్పాట్లను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ శనివారం పరిశీలించారు. దివిసీమను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు మోపిదేవి వార్పు వద్ద కూడలి ప్రదేశాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు వారు సూచించారు. చారిత్రాత్మక, ఆధ్యాత్మిక, బౌద్ధ, సాహిత్య, కళారంగాల్లో పర్యాటక అభివృద్ధి సాధిస్తే నియోజకవర్గ ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి పెనుమూడి సాయిబాబు, ఇరిగేషన్ డీఈఈ గణపతి, ఏఈ రవితేజ పాల్గొన్నారు.



కొత్తపల్లి భుజంగరావును సత్కరిస్తున్న దివి జర్నలిస్ట్ యూనియన్ నేతలు

ఆదర్శ పాత్రికేయుడు కొత్తపల్లి భుజంగరావు

అవనిగడ్డ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నీతి, నిజాయితీలతో నాలుగు దశాబ్దాలపాటు జర్నలిస్టుగా సేవలందించిన కొత్తపల్లి భుజంగరావు నేటితరం పాత్రికేయులకు ఆదర్శనీయుడని దివి జర్నలిస్ట్ యూనియన్ నేతలు అన్నారు. ఇటీవల నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ ఇండియా నుంచి భుజంగరావు జీవన సాఫల్య పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా శుక్రవారం పులిగడ్డ ఇరిగేషన్ గెస్ట్‌హౌస్‌లో ఆయనను సత్కరించారు. ఆంధ్రజ్యోతి పత్రిక పేరును తన ఇంటిపేరుగా మలుచుకుని వివాదాలకు అతీతంగా సమాజంలో అనేక సమస్యలను భుజంగరావు వెలుగులోకి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేశారని సీనియర్ జర్నలిస్టులు దీవి సారంగపాణి అయ్యంగార్, సింహాద్రి కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. అవనిగడ్డ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో పులిగడ్డలో నిర్వహించిన దివి జర్నలిస్టుల కార్తీక వనసమారాధన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు అజంతా శ్రీనివాసరావు, పుట్టి శ్రీనివాసరావు, దివి ప్రాంత జర్నలిస్టులు పాల్గొన్నారు.



టీడీపీ మండల అధ్యక్షుడు నడకుదుటి జనార్దనరావుకు ఏకగ్రీవమైనట్టు లేఖను అందిస్తున్న చందన రంగారావు

టీడీపీ కె.కొత్తపాలెం
గ్రామ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

మోపిదేవి నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కె.కొత్తపాలెం గ్రామ కమిటీ ఎన్నిక ఏకగ్రీవమైంది. గ్రామంలోని కల్యాణ మండపంలో టీడీపీ మండల అధ్యక్షుడు నడకుదుటి జనార్దనరావు అధ్యక్షతన పార్టీ సమావేశం శనివారం నిర్వహించారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా చందన రంగారావు, ఉపాధ్యక్షుడిగా కొక్కిలిగడ్డ నాగమల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా పడమటి వెంకటేశ్వరరావును ప్రతిపాదించగా ఏకగ్రీవంగా ఆమోదించినట్లు పార్టీ కార్యకర్తలు తెలిపారు. కమిటీ సభ్యులుగా చందన నాగసుబ్బారావు, గొరికిపూడి కొండలు, పల్లె వీరుళ్లు, జంపాన నరసింహారావు, సనకా వెంకటేశ్వరరావు, బుర్రే కోటేశ్వరరావు, మన్నం గోపాలకృష్ణను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు మండల కమిటీ తెలిపింది. సీనియర్ నాయకుడు రావి నాగేశ్వరరావు, కొక్కిలిగడ్డ, కె.కొత్తపాలెం సర్పంచ్‌లు దిడ్ల జానకి రాంబాబు, కొక్కిలిగడ్డ మాధవి పాల్గొన్నారు.

వేలం వాయిదా

పెడన, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పైడమ్మ ఉత్సవాల్లో వివిధ హక్కులు పొందేందుకు శనివారం అధికారులు ఆలయంలో వేలం నిర్వహించినా, గత ఏడాది కంటే హెచ్చుపాట రానందున వాయిదా వేశారు. ఐదు విభాగాలకు గాను నాలుగు వేలం పాటలను వాయిదా వేశారు. కొబ్బరిచిప్పలు పోగు చేసుకునే హక్కుకు గత ఏడాది రూ. 22వేలు రాగా, ఈ ఏడాది రూ. 61వేల ఆదాయం సమకూరింది. నాలుగు విభాగాలకు ఈనెల 22వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు వేలం నిర్వహిస్తామని ఈవో జి.వి. కృష్ణారావు తెలిపారు.



ధర్మకర్తల కమిటీని అభినందిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

వేంకటాచలస్వామి దేవస్థానం
ధర్మకర్తల కమిటీ ప్రమాణస్వీకారం

గూడూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కంకటావ గ్రామంలో ఉమామహేశ్వర వేణుగోపాల వేంకటాచలస్వామి దేవస్థాన ధర్మకర్తల కమిటీ చైర్మన్‌గా తోట విష్ణుమూర్తి, పాలక మండలి సభ్యులు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి, నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆలయ ముఖ మండపం, ధ్వజస్తంభం, స్లాబ్ పనులకు, పునఃనిర్మాణ, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తర్వాత కంకటావ టూ షా అబ్దుల్లా పాలెం తారు రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి లేళ్లగరువులో సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. పెడన మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ భీముని అనంతలక్ష్మి, డీసీ చైర్మన్ పోతన స్వామి, దాసరి ఉమాసాయిరాం, కంకటావ, లేళ్లగరువు సర్పంచ్‌లు మోహనరావు, మానస, ధనుష్, వాకా శ్రీనివాసరావు, సుంకర రవి పాల్గొన్నారు.

భద్రాద్రి రామాలయం ధర్మకర్తల మండలి
చైర్మన్‌గా ఎస్ఆర్‌వై రామ్‌నాథ్ దేవీప్రసాద్

మచిలీపట్నం టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి రామాలయం ధర్మకర్తల మండలి చైర్మన్‌గా శనివారం ఎస్ఆర్‌వై రామ్‌నాథ్ దేవీప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, అర్బన్ బ్యాంకు చైర్మన్ దిలీప్‌కుమార్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పి.వి.ఫణికుమార్, కార్పొరేటర్లు అన్నం ఆనంద్, దింటకుర్తి సుధాకర్ పాల్గొన్నారు.

బ్యాంకింగ్ వ్యవస్థపై అవగాహన అవసరం

ఘంటసాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఘంటసాల శాఖ మేనేజర్ శ్రీనివాస్ దయాళ్ పేర్కొన్నారు. విజిలెన్స్ ఎవేర్‌నెస్ వీక్‌లో భాగంగా శనివారం వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు బ్యాంకింగ్ సేవలపై ఆయన అవగాహన కల్పించారు.

అనారోగ్యంతో ఆత్మహత్య

మచిలీపట్నం టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం కారణంగా మనస్తాపం చెంది బందరు మండలం బుద్దాలపాలెం గ్రామంలో శనివారం మందా వెంకన్న(42) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ సత్యనారాయణ అందించిన వివరాలిలా ఉన్నాయి. సత్యనారాయణకు ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. మద్యానికి బానిసైన వెంకన్న ఏడాదిలోనే భార్యతో విడాకులు తీసుకున్నాడు. మద్యానికి బానిసైన కారణంగా లివర్, కిడ్నీలు పాడయ్యాయి. మచిలీపట్నం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యానికి వచ్చాడు. వైద్యులు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి పంపారు. అక్కడ నుంచి ఇంటికి వచ్చేసి మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అందుబాటులో
ఎల్‌బీజీ 752 మినుము విత్తనాలు

ఘంటసాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కృషి విజ్ఞాన కేంద్రంలో ఎల్‌బీజీ 752 ధ్రువీకరణ విత్తనాలు(మినుము) అందుబాటులో ఉన్నాయని శాస్త్రవేత్త రేవతి తెలిపారు. రైతుల అవసరార్థం నాలుగు కేజీల ప్యాకెట్లలో సిద్ధంగా ఉంచామని తెలిపారు. కేజీ రూ. 140కు విక్రయిస్తున్నామని, వివరాలకు 63002 75066 నెంబరుకు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

పోరాటయోధుడు బిర్సాముండా



ఘంటసాలలో బిర్సా ముండా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బోలెం నాగమణి

ఘంటసాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల హక్కుల కోసం పోరాడిన వీరుడు బిర్సా ముండా అని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బోలెం నాగమణి పేర్కొన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద బిర్సా ముండా 150వ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ బాణావత్ వెంకటేశ్వరమ్మ, ఎంపీడీవో సుబ్బారావు, డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఎంఈవో -2 మోమిన్, కార్యదర్శి జయలక్ష్మి, టీడీపీ నాయకులు బోలెం రామారావు, గొర్రెపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. కొడాలి పంచాయతీ కార్యా లయంలో బిర్సా ముండా చిత్రపటానికి కార్యదర్శి సీహెచ్‌వీఎస్ నాగమణి పూలమాల వేసి నివాళులర్పించారు.



చలమలశెట్టి సురేంద్రనాథ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

చలమలశెట్టి సురేంద్రనాథ్ మృతి
బందరుకు తీరనిలోటు

మచిలీపట్నం టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌కో సంస్థ అధినేత చలమలశెట్టి అనిల్ తండ్రి చలమలశెట్టి సురేంద్రనాథ్ మృతి బందరుకు తీరనిలోటని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నంలో శనివారం నిర్వహించిన సురేంద్రనాథ్ సంతాప సభలో ఆయన మాట్లాడారు. మచిలీపట్నం మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ చలమలశెట్టి వెంకటలక్ష్మి భర్త సురేంద్రనాథ్ మచిలీపట్నంలో వైద్యసేవలందిస్తూ పేదలకు ఎంతో సాయం చేసేవారన్నారు. సురేంద్రనాథ్ కుమారులు చలమలశెట్టి అనిల్, సునీల్, వెంకటేష్‌ను ఆయన పరామర్శించారు.

ప్రమాదానికి కారణమైన లారీ గుర్తింపు

పెడన, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పెడన బైపాస్ రోడ్డులో శుక్రవారం ఉదయం రోడ్డు ప్రమాదానికి కారణమైన లారీని పోలీసులు గుర్తించారు. బాపట్ల నుంచి కాకినాడకు లోడుతో వెళుతున్న లారీ శుక్రవారం ఉదయం బైపాస్ రోడ్డుపై మార్నింగ్ వాక్ చేస్తున్న కేడీసీసీ బ్యాంకు విశ్రాంత ఉద్యోగి మట్టా శ్రీవెంకట సత్యవరప్రసాదరావు అలియాస్ మట్టా బాబూరావును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. లారీని డ్రైవర్ ఆపకుండా పరారయ్యాడు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా లారీ రావులపాలెంలో ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. రావులపాలెం వెళ్లిన పోలీసులు శుక్రవారం రాత్రి లారీతో సహా డ్రైవర్‌ను పెడన పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి

మచిలీపట్నం టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల్లో బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.వి.వి. సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ నాయకులు భాస్కర్, పి.రాజ్యలక్ష్మి, టి.శిరీష, ఎం.దేవిక తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరస్వామి దేవాలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

చల్లపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆలయాలను అభివృద్ధి చేయడం శుభపరిణామం అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శనివారం చల్లపల్లి ప్రధాన సెంటరులో లక్ష్మీవిఘ్నేశ్వరస్వామి దేవాలయ పునర్నిర్మాణ పనులను శంకుస్థాపన చేసి ఆయన ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వేమూరి శ్రీనివాసరావు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయకమిటీ గౌరవ అధ్యక్షుడు యార్లగడ్డ శ్రీనివాసరావు, కమిటీపెద్దలు ఎమ్మెల్యేను సత్కరించారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, వైస్‌ఎంపీపీ మోర్ల రాంబాబు, డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, ఎంపీటీసీలు మేకా బంగారుబాబు, మాలెంపాటి శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ బొందలపాటి వీరబాబు, ప్రముఖులు నాదెళ్ల వెంకట నరసయ్య, మోర్ల శివ, వేముల హరికృష్ణ, అంబటి భువనేశ్వరరావు, తాతా ప్రదీప్, తుటారం ప్రసాద్, ఈవో పి.వి.మాధవేంద్రరావు, కమిటీపెద్దలు ఆత్మకూరి వెంకటేశ్వరరావు, నర్రా సురేంద్ర, ట్యాక్సీ ఓనర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

రావెళ్ల ట్రస్ట్ రూ.15 వేలు విరాళం

లక్ష్మీవిఘ్నేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రావెళ్ల కృష్ణసేవాసమితి చైర్మన్ రావెళ్ల ఉదయ్ కుమార్ రూ.15 వేలు విరాళం అందజేశారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చేతులమీదుగా ట్రస్ట్ అధ్యక్షుడు నిడమానూరి దిలీప్‌కుమార్ ద్వారా కమిటీ పెద్దలకు నగదు అందించారు.

సూక్ష్మతరహా పరిశ్రమల
స్థాపనకు ప్రభుత్వ ప్రోత్సాహం

గూడూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహిళలు, నిరుద్యోగులు, చిన్న, సూక్ష్మతరహా పరిశ్రమలు స్థాపించుకునేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని పరిశ్రమల శాఖ జిల్లా జనరల్ మేనేజర్ వెంకట్రావు తెలిపారు. వాసవ్య మహిళా మండలి, హెచ్‌సీఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా పరిశ్రమ శాఖ వారు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని శనివారం పోలవరం గ్రామంలో నిర్వహించారు. బ్యాంకు రుణాలు, ప్రభుత్వ సబ్సిడీలు, సొంత వ్యాపారాలు పెట్టుకోడానికి రుణం పొందడానికి ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ఉపయోగపడుతుందని వెంకట్రావు తెలిపారు. ఐపీవో మనోజ్, మాజీ సర్పంచ్ కారుపర్తి శ్రీనివాసరావు, పోలవరం స్నేహిత కలంకారీ కళాకారులు, వాసవ్య మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

శివరామకృష్ణ క్షేత్రానికి
రూ.1,01,116 విరాళం

కోడూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కోడూరు శివరామకృష్ణ క్షేత్ర పునర్నిర్మాణానికి విజయవాడకు చెందిన తటవర్తి రఘుబాబు దంపతులు రూ.1,01,116 విరాళాన్ని అందించారు. నగదును కమిటీ సభ్యులకు శనివారం అందజేశారు. తటవర్తి రఘుబాబు దంపతులను కమిటీ సభ్యులు సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు అన్నం వెంకట సుబ్బారావు, బడే భావన్నారాయణ, పెద్ది బాబురావు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

పెడన, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ సమావేశపు హాలులో వ్యవసాయ ఉత్పత్తుల మద్దతు ధరలను తెలిపే ప్రచార పోస్టర్లను ఏఎంసీ చైర్‌పర్సన్ భీముని అనంతలక్ష్మి శనివారం ఆవిష్కరించారు. రైతులకు లభించే మద్దతు ధరలు, కొనుగోలు ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలు పోస్టర్లలో పొందుపరిచారు. ఏఎంసీ డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అనధికార లే అవుట్ తొలగింపు

పెడన, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 1వ వార్డులో పైడమ్మ దేవస్థానం వెనుక ప్రాంతంలో 38 సెంట్ల స్థలంలో వేసిన అనధికార లే అవుట్‌ను మునిసిపల్ అధికారులు శనివారం తొలగించారు. ఇన్‌చార్జి కమిషనర్ రామాంజనేయులు, ఇన్‌చార్జి టీపీవో బండి కిరణ్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ జితేంద్ర పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక వనసమారాధన

అవనిగడ్డ రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పులిగడ్డలోని జలవనరుల శాఖ అతిథిగృహంలో నిర్వహించిన కార్తీక వనసమారాధనలో ఎమ్మెల్యే ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పాల్గొన్నారు. ఉసిరి చెట్టు వద్ద పూజలు చేశారు. ఇరిగేషన్ ఎస్ఈ మోహనరావుతో కలిసి వన భోజనం చేశారు. పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, ఈఈ రవికిరణ్, డీసీ చైర్మన్లు బండ్రెడ్డి నాగమల్లికార్జునరావు, నిడమానూరు దిలీప్‌కుమార్, ఇరిగేషన్ డీఈఈలు బీబీఎస్ గణపతి, అపర్ణ, ఆర్సీ డీఈఈ గోపీనాథ్, డీసీ వైస్‌చైర్మన్ బి.రఘునాథ్‌ప్రసాద్ పాల్గొన్నారు.